సాక్షి కర్నూలు

ఆదివారం । 8 । జనవరి । 2023

I



ఫిబ్రవరి 11 నుంచి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలంలో ఫిబ్రవరి 11 నుంచి 21వ తేదీ వరకు 11 రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈఓ లవన్న తెలిపారు.



ఇంటి వద్దకే వైద్యం

ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ఇంటి వద్దనే ప్రజలకు వైద్యం అందుతోందని కర్నూలు ఎంపీ సంజీవకుమార్ అన్నారు. మెడికల్ కాలేజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

IIలో



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,623.18
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:70.702
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,439

న్యూస్‌రీల్

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న పి. కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): పోలీసు పరేడ్ మైదానంలో ఈ నెల 26వ తేదీన గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వేడుకలో ఎన్‌సీసీ, గురుకుల విద్యార్థులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేయాలని, ఈనెల 22వతేదీలోపు శాఖల వారీగా వివరాలను పంపాలన్నారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్ తేజ్ , డీఆర్‌ఓ నాగేశ్వరరావు, సీపీఓ అప్పలకొండ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

రేపు 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

నేడు గ్రూపు-1 ప్రిలిమ్స్ పరీక్ష

కర్నూలు(సెంట్రల్): గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్షను ఆదివారం 29 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు. మొత్తం 9,651 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. నిర్ణీత సమయానికి కంటే 15 నిమిషాలు ముందుగానే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం సెషన్‌లో 9.45 గంటలకు మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. అనంతరం వచ్చిన వారిని అనుమతించరు.

కేసీ కెనాల్‌కు 458 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు 458 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు శనివారం విలేకరులకు తెలిపారు. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని, డ్యాంలో ప్రస్తుతం 0.782 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు.

శ్రీమఠానికి విరాళాల వెల్లువ

మంత్రాలయం: ప్రముఖ రాఘవేంద్రస్వామి మఠానికి భక్తుల నుంచి విరాళాలు వెల్లువలా వస్తున్నాయి. శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తుల నుంచి రూ.3.16 లక్షల విరాళం వచ్చినట్లు మేనేజర్ శ్రీనివాసరావు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రభ అరవింద్ వెండి రథానికి రూ.లక్ష, బెంగళూరుకు చెందిన వెంకటేష్ ప్రభు అన్నదానానికి రూ.లక్ష, గోసంరక్షణకు రూ.50 వేలు, విద్యాదానానికి రూ.38 వేలు, బెంగళూరుకు వాసి శంకరానంద వెండిరథానికి రూ.25 వేలు అందజేసినట్లు తెలిపారు.

ముగిసిన పింఛన్ వారోత్సవాలు

కర్నూలు(అగ్రికల్చర్): పింఛన్ వారోత్సవాలు ఈ నెల 1వ తేదీన మొదలై శనివారంతో ముగిశాయి. వారోత్సవాల్లో పెంచిన పింఛన్‌తో పాటు నూతన లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ఉత్సవాలు పెద్ద ఎత్తున జరిగాయి. కర్నూలు జిల్లాలో 2,43,573 లబ్ధిదారులు ఉండగా శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 2,38,841 మందికి, నంద్యాల జిల్లాలో 2,19,244 మందికి గాను 2,16,793 మందికి పింఛన్లు అందజేశారు. శనివారం వరకే పింఛన్ల పంపిణీకి అవకాశం ఉండగా, ఇంకా కొంతమంది తీసుకోవాల్సి ఉండడంతో 9వ తేదీ వరకు పొడిగించినట్లు డీఆర్‌డీఏ, వైకేపీ పీడీ వెంకట సుబ్బయ్య తెలిపారు.

జాగిలం.. కేసు వేగిరం

SUNDAY SPECIAL

రోజీ.. రాఖీ.. జూలీ.. పేరు ఏదైనా కేసు ఛేదనలో వీటి ఇవే సాటి. పిలిచిన వెంటనే పరుగు తీస్తాయి. నేరస్థలంలో కీలక ఆధారాలను సేకరిస్తాయి. కేసుల దర్యాప్తును వేగవంతం చేస్తాయి. పోలీస్ శాఖలో వీటి సేవలు విలువైనవి. జిల్లాలో చాలా మంది నేరస్తులను పట్టించాయి. హత్య కేసుల్లో చిక్కు ముడులను విప్పాయి. చోరీ ఘటనల్లో దొంగలను పట్టించాయి. డాగ్‌స్క్వాడ్ వచ్చిందంటే కేసు మిస్టరీ వీడాల్సిందే. పోలీస్ శాఖలో 'భైరవ' సేనల సేవలపై కథనం..



సెల్యూట్ చేస్తున్న పోలీస్ శునకాలు





నేరస్థలంలో మర్చిపోయిన వస్తువులను వాసన గుర్తించి పట్టుకొస్తున్న దృశ్యాలు



దొంగను పట్టుకునేందుకు దాడు తీస్తున్న డాగ్ స్క్వాడ్

- ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో గతేడాది డిసెంబర్ 15న తోడికోడళ్లు రామేశ్వరమ్మ, రేణుక హత్యోదంతాల్లో మొదట్లో రేఖ అనే జాగిలం కనుగొన్న ఆధారాలు కీలకమయ్యాయి. ఘటనా స్థలంలో పడివున్న చెప్పు ఆధారంగా నిందితుల ఇంటి వద్దకు వెళ్లి అక్కడ మరో చెప్పును చూపించి పోలీసులకు కీలకమైన ఆధారం దొరికేందుకు ఉపయోగపడింది. దాని ఆధారంగా మృతురాళ్ల మామ, భర్తలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు.
- కర్నూలు మాధవీనగర్‌లో నివాసముంటున్న వృద్ధుడు సుబ్రహ్మణ్యం శర్మ (83) గతేడాది డిసెంబర్ 3వ తేదీన దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు జాగిలంతో అక్కడికి వెళ్లి అరగంట వ్యవధిలోనే మనవడే హత్యకు పాల్పడ్డాడని గుర్తించారు. ఈ కేసులో టోనీ అనే శునకం కీలకపాత్ర పోషించింది. ఈ డాగ్ పలు కేసులు ఛేదించి ఉన్నత స్థాయి అధికారుల గుర్తింపు పొందింది.



నమస్తే పెడుతున్న రేఖ డాగ్

- పోలీసు శాఖలో శునకాల భాగస్వామ్యం
- విశ్వాసానికి మారుపేరు... విధుల్లో వినూత్న తీరు
- నేర ఘటనల దర్యాప్తులో జాగిలాల పాత్ర కీలకం
- ఆధారాల సేకరణలో ప్రతిభా పాటవాలు

కర్నూలు: శునకం.. విశ్వాసానికి మారుపేరు. బుక్కెడు బువ్వ పెట్టి పోషిస్తే మరణించేవరకు మరువదు. శాంతిభద్రతలు, నేరాల నియంత్రణే ధ్యేయంగా పనిచేస్తున్న పోలీసు శాఖలో శునకాలు ప్రత్యేక పాత్ర పోషిస్తున్నాయి. ఏదైనా నేరం జరిగిన సమయంలో, వీఐపీల పర్యటన సందర్భంగా వీటి పాత్ర ప్రధానంగా మారుతోంది. ఒక్కోసారి పోలీసు జాగిలాలు అందించే ఆధారాలు కీలకంగా మారి నిందితులు పట్టుబడుతున్నారు. నేరం జరిగినప్పుడు ఆధారాలు సేకరించేందుకు ముందుగా ఆ ప్రదేశంలో క్లూస్ టీమ్‌తో పాటు జాగిలాలతో ఆధారాలను సేకరిస్తున్నారు. ఘటన జరిగిన ప్రాంతం నుంచి సుమారు 5 కిలోమీటర్ల పరిధి వరకు జాగిలం నిందితులను పసిగట్టేందుకు వెళ్తుంది. జాగిలాలు కనుగొన్న ఆధారాలతో నిందితులను సులభంగా గుర్తించగలుగుతున్నారు.

ప్రత్యేక వసతి సదుపాయాలు

కర్నూలులో వీటి కోసం ప్రత్యేక భవనం కేటాయించారు. ప్రస్తుతం పోలీసు శాఖలో శిక్షణ పొందిన తొమ్మిది శునకాలు ఉన్నాయి. అందులో నంద్యాల జిల్లాకు నాలుగు జాగిలాలను కేటాయించారు. అయితే నంద్యాలలో పోలీసు శాఖకు అనువైన వసతి సౌకర్యం (గదులు) లేకపోవడంతో వాటిని కూడా కర్నూలులోనే ఉంచి అవసరమైన సమయంలో నంద్యాలకు తీసుకువెళ్తుంటారు. ఒక్కో జాగిలానికి ఒక్కో గది కేటాయించారు. అందులో సీలింగ్ ఫ్యాన్లతో పాటు దోమలు కట్టుకుండా తెరలు ఉంచారు. వేసవిలో ప్రత్యేకంగా వీటి కోసం కూలర్లు ఏర్పాటు చేస్తారు. జాగిలాలకు ఎలాంటి వ్యాధులు సంక్రమించకుండా ప్రతిరోజూ గదులను శుభ్రపరుస్తారు. వారానికి ఒకసారి స్నానం చేయిస్తారు. వీటిలో ల్యాంబ్రడర్, జర్మన్ షెప్పర్డ్ జాతికి చెందినవి ఉన్నాయి. ఒక్కోదానికి ఒక్కో పేరు పెట్టారు. చోరీలు, హత్య కేసులు, పేలుడు పదార్థాలు గుర్తించడంలో ఇవి సహాయపడతాయి. నేరం జరిగిన పరిసరాల్లో వాసన చూసి నిందితులు, అనుమానితులను గుర్తిస్తాయి. వీటి పోషణ, పర్యవేక్షణ కోసం తొమ్మిది మంది పోలీసు సిబ్బంది పనిచేస్తున్నారు.

పసిగట్టడంలో నేర్పరులు

టోనీ, రేఖ.. వీటి వయస్సు ఏడేళ్లు, ఆరేళ్లు. ఇవి ల్యాబ్రాడార్ సంతతికి చెందిన జాగిలాలు. హత్యలు, అత్యాచారాలు, చోరీల కేసుల్లో నిందితులను పసిగట్టడంలో నేర్పరులు. సుమారు 5 కిలోమీటర్ల వరకు పరుగెత్తగల సామర్థ్యం కలిగి ఉంటాయి. వీటికి ఈదన్న, పురుషోత్తం, పొన్ని (6), రాఖీ (6) జాగిలాలకు చంద్రశేఖర్, రాజులు హ్యాండ్లర్లుగా వ్యవహరిస్తున్నారు.

స్నిఫ్ఫర్ డాగ్స్

ఇవి పేలుడు పదార్థాల ఆచూకీని పసిగట్టగలవు. ప్రముఖులు జిల్లాకు వచ్చే సందర్భంలో వీటి సేవలను వినియోగించుకుంటారు. బహిరంగ సభ, సమావేశాలు ఏర్పాటు చేసిన స్థలాల్లో వీటితో క్షుణ్ణంగా తనిఖీ చేయిస్తారు. అనుమానాస్పద రహదారులను తనిఖీ చేయిస్తారు. భూమిలో దాచిన పేలుడు పదార్థాలనైనా ఇట్టే పసిగట్టేస్తాయి. రోజీ (9)కి రవికుమార్, టీనా (8)కు సుంకిరెడ్డి, జూలీ (7)కి చంద్రశేఖర్, జాన్యా (4)కి వెంకటప్పలు హ్యాండ్లర్లుగా వ్యవహరిస్తున్నారు.

ఫీడింగ్...

ఒక్కో జాగిలానికి ఒక కానిస్టేబుల్ సంరక్షకునిగా (హ్యాండ్లర్) వ్యవహరిస్తారు. ఉదయం, సాయంత్రం 250 గ్రాముల చొప్పున ఆహారం (ఫీడింగ్) రాయల్ కెనాన్ అందిస్తారు. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిరోజూ వాకింగ్, పెరేడ్ అనంతరం గూమింగ్ చేయిస్తుంటారు. ఔషధాలకు, ఇతర నిర్వహణకు నెలకు కొంత మొత్తం ప్రభుత్వం చెల్లిస్తుంది. వీటితో సబ్బులు, బ్రెషలు, దువ్వెనలు, ఔషధాలకు ఖర్చు చేస్తారు.



దొంగలను ఎలా పట్టుకోవాలో డాగ్‌కు నేర్పిస్తున్న హ్యాండ్లర్స్

హిందీ, ఇంగ్లిష్ భాషల్లో శిక్షణ...

పోలీసు జాగిలాలకు హిందీ, ఇంగ్లిషు భాషల్లోనే శిక్షణనిస్తారు. ఇవి పుట్టిన రెండు నెలల నుంచే శిక్షణకు సిద్ధంగా ఉంటాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లోని మొయినాబాద్ శిక్షణ కేంద్రంలో శిక్షణనిచ్చేవారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో అమరావతిలోని 6వ బెటాలియన్‌లో శిక్షణనిస్తున్నారు. మొదటి నుంచి సంరక్షకుల (హ్యాండ్లర్)ను కేటాయిస్తారు. శిక్షణ కాలంలో సంరక్షకుడు చెప్పినట్లు వినేలా తర్ఫీదు ఇస్తారు. క్రమశిక్షణ, సంస్కారం, నేర ఘటనలు, నేరగాళ్లను వాసన ఆధారంగా పసిగట్టే అంశాలను నేర్పిస్తారు. సెల్యూట్ (నమస్తే), సంతాల్ (నిటారుగా పడుకోవడం), బైరో, ఉరో, జంప్, వన్‌టైమ్ బోలో (ఒక్కసారి మొరగడం), టూటైమ్ బోలో (రెండు సార్లు మొరగడం) లాంటి మాటలను అర్థం చేసుకుని సంరక్షకుడు (హ్యాండ్లర్స్) చెప్పిన మాటలకు అనుగుణంగా స్పందిస్తుంటాయి. పోలీసు జాగిలాలు శిక్షణ పూర్తి చేసుకుని రంగంలోకి దిగిన తర్వాత ఏటా (ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్) వైద్యుల ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు, వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తారు. దీనిని పోలీసు పరిభాషలో రిఫ్రెష్ కోర్సు అని పిలుస్తారు. ఈ మేరకు వైద్యులు ధృవీకరణ పత్రం ఇస్తారు. ప్రతి పోలీసు జాగిలానికి రిటైర్‌మెంట్ ఉంటుంది. జాగిలానికి ఎనిమిదేళ్ల వయస్సు వచ్చిన తర్వాత వైద్యులు అనుమతిస్తేనే కొనసాగిస్తారు. అవి బతికున్నంత కాలం పోలీసుల సంరక్షణలోనే ఉంచుకుంటారు. ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది.

జాగిలాల సేవలిలా...

- కర్నూలు శివారులో జరిగిన రౌడీషీటర్ హత్య కేసును పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. జాగిలం గుర్తించిన ఆధారంతోనే ఇది సాధ్యమైంది.
- ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుందలో యాచకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అరగంట వ్యవధిలో అక్కడికి చేరుకున్న పోలీసు సిబ్బంది పోలీసు జాగిలం సేవలను వినియోగించారు. మృతదేహం వాసన పసిగట్టి శునకం ఓ ఇంటి వద్దకు వెళ్లి నిలిచిపోయింది. ఇంటి యజమానిని అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించాడు.
- కర్నూలు శివారు స్టాంటన్‌పురంలో ఓ ఇంట్లో భారీగా బంగారం చోరీ జరిగింది. క్లూస్ టీమ్‌తో పాటు డాగ్ స్క్వాడ్‌ను పోలీసులు ఘటనా స్థలానికి తీసుకెళ్లారు. నిందితుడు వదిలిన వస్తువుల వాసనను జాగిలం పసిగట్టి అతని ఇంటి వద్దకు తీసుకెళ్లడంతో దొరికిపోయాడు.
- ఆలూరు పీఎస్ పరిధిలో నాటుసారా వ్యాపారాల్లో తలెత్తిన విభేదాలతో 20 ఏళ్ల క్రితం ముగ్గురు వ్యక్తులను హత్య చేసి ఆనవాళ్లు లేకుండా చేయాలనే ఉద్దేశంతో శనగ కట్టె వాములో పెట్టి తగులబెట్టారు. చంపింది ఎవరు, చచ్చినవారు ఎవరనేది తెలియక పోలీసులు తలపట్టుకున్నారు. 'డైజీ' డాగ్ సాయంతో పోలీసులు ఈ కేసును ఛేదించారు.

నేరస్తులు తప్పించుకోలేరు



హత్యలు, దొంగతనాలతో పాటు ఇతర కేసుల ఛేదనలో పోలీసు జాగిలాల పాత్ర కీలకంగా ఉంది. ఒక్కసారి పోలీసు సిబ్బంది చేయలేని పని జాగిలాలు చేస్తుంటాయి. వాటికి నిత్యం ఇచ్చే శిక్షణ, నేర్పించే మెలకువలు ఇటీవల మరింత కఠినంగా ఉంటున్నాయి. నేరస్తులు ఎంతో తెలివిగా తప్పించుకోవాలని చూసినా చిన్నపాటి ఆధారంతో పట్టుకునేలా శిక్షణ ఉంటుంది. మనుషులతో పోల్చితే జాగిలాలకు 40 శాతం వాసన పసిగట్టే లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే 20 శాతం వినికిడి, 10 శాతం కంటిచూపు ఎక్కువగా ఉంటాయి. దీనిని అనుకూలంగా మార్చుకుని కేసుల ఛేదనలో వీటిని ఉపయోగించుకుంటున్నాం.

– పురుషోత్తం, ఏఆర్‌ఎస్‌ఐ

కర్నూలు సుందరీకరణకు ప్రాధాన్యం

- జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు



హంద్రీ నదికి ఇరువైపులా కంపచెట్ల తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు, మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని తదితరులు

కల్లూరు: నగర సుందరీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. శనివారం కల్లూరు అర్బన్ పరిధిలో హంద్రీ నదికి ఇరువైపులా కంపచెట్లు తొలగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, కమిషనర్ భార్గవ్‌తేజ్, మేయర్ రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్ర కర్నూలు లక్ష్యంగా అధికార యంత్రాంగం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మేయర్ రామయ్య మాట్లాడుతూ గ్రీన్‌కో వారి సహకారంతో లక్ష్మీపురం నుంచి కర్నూలు వన్‌టౌన్ వరకు హంద్రీ నదికి ఇరువైపులా కంపచెట్లు తొలగిస్తున్నామన్నారు. స్వచ్ఛ సర్వేలో కర్నూలు రాష్ట్రంలో రెండో స్థానం సాధించిందన్నారు. వచ్చే ఏడాది మొదటి స్థానంలోకి తీసుకువస్తామని చెప్పారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ హంద్రీ నది పరీవాహక ప్రాంతాన్ని శుభ్రం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంతరెడ్డి, సాపురు మాధురి, మిద్దె చిట్టెమ్మ, వైజా అరుణ, సంగాల సుదర్శన్‌రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, పల్లె శారద, కర్నూలు సింగిల్ విండో చైర్మన్ శివ శంకర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సభలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

కర్నూలు: రహదారులు, ఇరుకు సందులు, అనువుగా లేని ప్రదేశాలలో బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు అనుమతి లేదని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రహదారులకు దూరంగా ఉండే ప్రభుత్వ మైదానాలు, ప్రైవేటు స్థలాల్లో నిర్వహించుకోవచ్చన్నారు. రోడ్లపైనే సభలు, సమావేశాలు నిర్వహించాల్సిన కారణాలను లిఖితపూర్వకంగా పేర్కొని అనుమతి కోరితే ఆ మేరకు పరిశీలిస్తామన్నారు. ఇటీవల నెల్లూరు జిల్లాలోని కందుకూరు, గుంటూరులో జరిగిన తొక్కిసలాట, మరణాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. మున్సిపల్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అనుమతి తీసుకున్న తర్వాతే పోలీసులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

నేడు ఎమ్మిగనూరులో మహా రథోత్సవం



పుష్పక రథంపై ఉత్సవమూర్తి వ్యాహావళి దృశ్యం

ఎమ్మిగనూరు: శ్రీ నీలకంఠేశ్వరస్వామి మహారథోత్సవం ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరగనుంది. ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా నలుమూలలనుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి రానున్నారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, మాజీ ఎంపీలు బుట్టారేణుక, కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి, మేజిస్ట్రేట్ గురు అరవింద్, ఆదోని ఆర్డీవో, డీఎస్పీలు ఉత్సవాల్లో పాల్గొంటున్నట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. మహా రథోత్సవం జరిగే తేరుబజారులో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ నేతృత్వంలో ఒక డీఎస్పీ, పది మంది సీఐలు, 24మంది ఎస్‌ఐలతోపాటు ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు.. మొత్తం 250 మందిని బందోబస్తు కోసం ఏర్పాటు చేసినట్లు సీఐ మధుసూదన్ తెలిపారు.

వైభవంగా వ్యాహావళి, ప్రభావళి

వేడుకల్లో భాగంగా రెండో రోజు శనివారం వ్యాహావళి, ప్రభావళి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి కల్యాణం జరుపుకున్న ఉత్సవమూర్తులు పార్వతి, పరమేశ్వరులను శనివారం రాత్రి 10.30 గంటలకు దేవాలయం నుంచి బయటకు తీసుకొచ్చారు. ఉత్సవ మూర్తులను పుష్పక రథంపై అధిష్టింపజేసి వ్యాహావళోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం నీలకంఠేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం నుంచి తేరుబజారు వరకు సాగింది. తేరుబజారులో పుష్పకరథంపై ఉన్న ఉత్సవమూర్తులను ప్రభపై అధిష్ఠింపజేసి ప్రభావళి మహోత్సవం చేపట్టారు. తేరు బజారు నుంచి ఎదురు బసవన్న గుడి మీదుగా తిరిగి యథాస్థానం వరకు వ్యాహావళి మహోత్సవం నిర్వహించారు. భక్తులు నందికోల సేవతో, భజనలతో అలరించారు. ఉత్సవాల్లో ధర్మకర్త మురళీధర్ కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, వై రుద్రగౌడ్, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మాచాని జగదీష్, శివశంకర్, సురేష్, దేవేంద్ర, కౌన్సిలర్ నాగేశప్ప పాల్గొన్నారు.

ఆర్‌యూ సూపరింటెండెంట్ సస్పెన్షన్

● ప్రొఫెసర్‌కు షోకాజ్ నోటీసులు

కర్నూలు(సిటీ): రాయలసీమ యూనివర్సిటీలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.డి.ఇస్మాయిల్‌ను సస్పెండ్ చేశారు. ఇటీవల ఇస్మాయిల్ ఆర్‌యూకు చెందిన ప్రొఫెసర్ శ్రీనివాసరావుతో ఫోన్‌లో సంభాషిస్తున్న సమయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురించి తీవ్రమైన పరుష పదజాలంతో దూషించారు. అదేవిధంగా యూనివర్సిటీలో స్వీపర్ నుంచి ఉప కులపతి వరకు పనిచేస్తున్న ఒకే సామాజిక వర్గం ఉద్యోగులను సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడారు. ఇందుకు సంబంధించిన ఆడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో కొందరు వ్యక్తులు చేసిన ఫిర్యాదు మేరకు ఎం.డి.ఇస్మాయిల్‌పై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఇదే విషయంపై శనివారం సాయంత్రం వర్సిటీ స్టాండింగ్ కమిటీ ఫర్ అకడమిక్ సెనెట్ సభ్యులు సమావేశమై.. విచారణ పూర్తయ్యే వరకు ఇస్మాయిల్‌ను సస్పెండ్ చేసి, ఆయనతో ఫోన్ సంభాషణ కొనసాగించిన ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తీర్మానం చేశారు.

‘ఫ్యామిలీ ఫిజిషియన్’తో ఇంటి వద్దకే వైద్యం



మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

● కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో ఇంటి వద్దనే ప్రజలకు వైద్యం అందుతోందని కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ ఎస్. సంజీవకుమార్ చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజిలో శనివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఐదు సూపర్‌స్పెషాలిటీ విభాగాలకు పీజీ సీట్లు తీసుకొచ్చానని గుర్తు చేశారు. తాను పార్లమెంటులో ప్రస్తావించిన పలు బిల్లుల గురించి ఆయన వివరించారు. సమ్మేళనంలో తన స్నేహితులతో పాటు గురువులు కూడా ఉన్నారని చెప్పారు. నిరంతర వైద్యవిజ్ఞాన సదస్సుల ద్వారా వైద్య విద్యార్థులకు టీచింగ్ స్కిల్స్, స్పీకింగ్ స్కిల్స్ మెరుగుపడతాయన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ బి. సాంబశివారెడ్డి మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ కళాశాలల్లో కర్నూలు మెడికల్ కాలేజి నాల్గవదన్నారు. ఇక్కడ చదివిన వారు దేశ, విదేశాల్లో పేరొందిన వైద్యులుగా సేవలందిస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడుతూ 1956లో 50 సీట్లతో ప్రారంభమైన కళాశాల ప్రస్తుతం 250 సీట్లకు చేరిందన్నారు. ప్రస్తుతం 50 మంది ప్రొఫెసర్లు, 55 అసోసియేట్ ప్రొఫెసర్లు, 205 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 400 మంది పీజీలు ఉన్నారని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలోని పాతభవనాలు కూల్చివేసి కొత్తగా ఐపీ భవనం నిర్మాణం కాబోతోందన్నారు. పాత గైనిక్ విభాగం స్థానంలో ఓపీ బ్లాక్, ఎమర్జెన్సీ బ్లాక్ రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నరసింహులు, డాక్టర్ మునీరుద్దీన్, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఈసీ మెంబర్ రమేష్, సీనియర్ వైద్యులు డాక్టర్ విక్రమసింహారెడ్డి, డాక్టర్ జి. సుధాకర్, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఆధునిక నృత్య పోటీలు

కర్నూలు కల్చరల్: ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జాతీయ స్థాయి ఆధునిక నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పాములపాడు: ఇస్కాల గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన చాకలి లింగస్వామి కుమారుడు మహేష్ (18) ఇంటర్ పూర్తి చేశాడు. శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కుమారుడి మృతితో తల్లి దండ్రులు బోరున విలపిస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌ఏ-1 ప్రశ్నపత్రం లీకేజీ ప్రచారంపై ఫిర్యాదు

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో ప్రస్తుతం సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల ప్రశ్నపత్రం జిల్లాలో లీకైనట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండటంపై డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓ ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, కానీ కొందరు పేపర్ లీకేజీ జరిగినట్లు సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిపై పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ జరుగుతోందన్నారు. విచారణలో నిజమని తెలితే బాధ్యులపై క్రిమినల్ కేసులతో పాటు, శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు నేడు ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి శాప్ లీగ్ కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-17 బాలుర విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో క్రీడాకారులు తప్పనిసరిగా తమ పేర్లను శాప్ లీగ్ యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో అనంతపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న 2వ రాష్ట్ర స్థాయి శాప్ లీగ్స్ కుస్తీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వివరాలకు జిల్లా కుస్తీ సంఘం కార్యదర్శి అబ్రహాం లింకన్ 8099804318 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన క్రీడా పోటీలు


విజేతలతో కాలేజీ అధ్యాపకులు

నంద్యాల(సిటీ): పట్టణంలోని ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఇంటర్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. షటిల్ సింగల్స్, వాలీబాల్, కబడ్డీలో ఈఎస్‌సీ ప్రభుత్వ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. టేబుల్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్‌లో కేవీ సుబ్బారెడ్డి కళాశాల విద్యార్థులు గెలుపొందారు. విజేతలకు ఈఎస్‌సీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు ఎంఎస్వీ రాజు బహుమతులను అందజేశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఫిబ్రవరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు అల్‌కరాజ్ దూరం

సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌నుంచి వరల్డ్ నంబర్‌వన్, స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్‌కరాజ్ తప్పుకున్నాడు. గత కొంత కాలంగా కుడి కాలి గాయంతో బాధపడుతున్న అతను సరైన సమయంలో కోలుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించాడు. గత ఏడాది సెప్టెంబర్ 12న అల్‌కరాజ్ ఏటీపీ చరిత్రలో అతి పిన్న వయసులో వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచాడు. అల్‌కరాజ్ దూరం కావడంతో డిఫెండింగ్ చాంపియన్ రాఫెల్ నాదల్ ఈ టోర్నీలో టాప్ సీడ్‌గా బరిలోకి దిగనున్నాడు.

పంత్ మోకాలికి శస్త్ర చికిత్స

కారు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న భారత క్రికెటర్ రిషభ్ పంత్‌కు ముంబైలో మోకాలి శస్త్రచికిత్స జరిగింది. డాక్టర్ దిన్షా పర్దీవాలా శుక్రవారం ఈ సర్జరీని నిర్వహించారని... ప్రస్తుతం పంత్ అబ్జర్వేషన్‌లో ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. అతని రీహాబిలిటేషన్ పూర్తి అయ్యే వరకు పర్దీవాలా తగిన సూచనలు ఇస్తారని, వాటిని బీసీసీఐ డాక్టర్ల పర్యవేక్షణలో అమలు చేస్తారని బోర్డు అధికారి చెప్పారు.



మండే సూర్యుడు...

- చివరి టి20లో 91 పరుగులతో శ్రీలంకపై భారత్ ఘనవిజయం
- 2–1తో సిరీస్ వశం

సూర్యకుమార్ 51 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సర్లతో 112 నాటౌట్

రాజ్‌కోట్: సూర్యకుమార్ యాదవ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆఖరి మ్యాచ్‌లో శ్రీలంక కొట్టుకుపోయింది. టీమిండియా 91 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. టాస్ నెగ్గిన భారత్ మొదట 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ (51 బంతుల్లో 112 నాటౌట్; 7 ఫోర్లు, 9 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. రాహుల్ త్రిపాఠి (16 బంతుల్లో 35; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిశాడు. అనంతరం శ్రీలంక 16.4 ఓవర్లలో 137 పరుగులకే కుప్పకూలింది. కుశాల్ మెండిస్ (23), షనక (23) టాప్ స్కోరర్లు.

సూర్య ది గ్రేట్ ఇన్నింగ్స్

నాలుగో బంతికి ఇషాన్ కిషన్ (1) వికెట్ తీసిన లంకకు ఆ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. కెరీర్‌లో రెండో మ్యాచ్ ఆడుతున్న రాహుల్ త్రిపాఠి మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా, శుబ్‌మన్ గిల్ (36 బంతుల్లో 46; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) మొదటి 9 బంతుల్లో సింగిల్ కూడా తీయలేకపోయాడు! తీక్షణ ఐదో ఓవర్లో 3 బౌండరీలు బాదిన త్రిపాఠి... కరుణరత్నే ఆరో ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టాడు. అదే ఊపులో థర్డ్‌మ్యాన్ దిశగా షాట్ ఆడబోయి మదుషంక చేతికి చిక్కాడు. 'పవర్ ప్లే' ఆఖరి బంతికి సూర్య క్రీజులోకి వచ్చాడు. 6 ఓవర్ల పవర్ ప్లేనే అయిపోయింది. మిగతా 14 ఓవర్ల పవర్ స్ట్రోక్స్ ఎలావుంటాయో 'స్కై' చూపెట్టాడు.



సూర్యకుమార్

కవర్ డ్రైవ్, ర్యాంప్ షాట్లతో టచ్‌లోకి వచ్చిన సూర్యకుమార్ స్కోరు బోర్డును ఆద్యంతం పరుగు పెట్టించాడు. స్పిన్, పేస్, గూగ్లీ ఇలా ఏ బంతి వేసినా తన శైలి షాట్లతో చెలరేగిపోయాడు. పేస్‌తో ముఖం మీదికి వచ్చే బంతుల్ని విడిచి పెట్టలేదు. అదే పనిగా ర్యాంప్ షాట్లతో సిక్స్‌లు, ఫోర్లుగా దంచేస్తూ 26 బంతుల్లోనే ఫిఫ్టీని అవలీలగా పూర్తి చేసుకున్నాడు. అతని షాట్లకు ఆకాశమే హద్దయ్యింది. ఫుట్ టాస్ బంతుల్ని, యార్కర్ డెలివరీల్ని మంచినీళ్ల ప్రాయంలా బౌండరీలకు తరలించాడు. ఎలా వేసినా దంచేశాడు. అతని ధాటికి మదుషంక 13వ ఓవర్లో 18 పరుగులు రాగా... తీక్షణ మరుసటి ఓవర్లో 2, 4, 6, 6, 1లతో సూర్య వేగం ఇంకాస్త పెంచాడు. ఆఖరి బంతిని ఆడిన గిల్ బౌండరీ కొట్టడంతో ఆ ఓవర్లో 23 పరుగులొచ్చాయి. కేవలం ఈ రెండు ఓవర్లలోనే భారత్ 113/2 నుంచి 154/2కు చేరింది. హసరంగ 15వ ఓవర్లో గిల్ క్లీన్‌బౌల్డయ్యాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (4), దీపక్ హుడా (4) స్వల్ప వ్యవధిలోనే నిష్క్రమించినా... సూర్య బాదుడుకు అదేమంతా ప్రభావమే చూపలేదు. ఆఖర్లో జతయిన అక్షర్ పటేల్ (9 బంతుల్లో 21 నాటౌట్; 4 ఫోర్లు) చకచకా బౌండరీలు బాదాడు.

18వ ఓవర్ చివరి బంతికి భారత్ స్కోరు 200కు చేరగా, 19వ ఓవర్ తొలి బంతికి సూర్యకుమార్ (45 బంతుల్లో; 6 ఫోర్లు, 8 సిక్సర్లు) సెంచరీ పూర్తయ్యింది. పొట్టి ఫార్మాట్‌లో అతనికిది మూడో సెంచరీ కావడం విశేషం.

లంక గిలగిల

భారీ లక్ష్యం చూడగానే శ్రీలంక బ్యాటర్స్ బెదిరినట్లున్నారు. క్రీజులోకి 11 మంది దిగినా... అందులో ఏ ఒక్కరు కనీసం పాతిక పరుగులైనా చేయలేకపోయారు. గత మ్యాచ్‌లో విమర్శలపాలైన భారత బౌలింగ్ ఒక్కసారిగా దెబ్బతిన్న పులిలా పంజా విసిరింది. నిసాంక (15; 3 ఫోర్లు), అవిష్క ఫెర్నాండో (1), ధనంజయ (14 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్), అసలంక (14 బంతుల్లో 19; 2 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ షనక, హసరంగ (9) ఎవరు వచ్చినా ఆడింది కాసేపే! భారీ లక్ష్యానికి తగ్గ భాగస్వామ్యం ఒక్కటంటే ఒక్కటైన నిలబడకుండా బౌలర్లు సమష్టిగా దెబ్బ తీశారు. దీంతో కనీసం 17 ఓవర్లయినా పూర్తిగా ఆడలేక ఆలౌటైంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) ధనంజయ (బి) మదుషంక 1; గిల్ (బి) హసరంగ 46; త్రిపాఠి (సి) మదుషంక (బి) కరుణరత్నే 35; సూర్యకుమార్ నాటౌట్ 112; హార్దిక్ (సి) ధనంజయ (బి) రజిత 4; హుడా (సి) హసరంగ (బి) మదుషంక 4; అక్షర్ నాటౌట్ 21; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 228. వికెట్ల పతనం:** 1-3, 2-52, 3-163, 4-174, 5-189. **బౌలింగ్:** మదుషంక 4-0-55-2, రజిత 4-1-35-1, తీక్షణ 4-0-48-0, కరుణరత్నే 4-0-52-1, హసరంగ 4-0-36-1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) మావి (బి) అర్ష్‌దీప్ 15; మెండిస్ (సి) ఉమ్రాన్ (బి) అక్షర్ 23; ఫెర్నాండో (సి) అర్ష్‌దీప్ (బి) పాండ్యా 1; ధనంజయ (సి) గిల్ (బి) చహల్ 22; అసలంక (సి) మావి (బి) చహల్ 19; షనక (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 23; హసరంగ (సి) హుడా (బి) ఉమ్రాన్ 9; కరుణరత్నే (ఎల్బీ) (బి) పాండ్యా 0; తీక్షణ (బి) ఉమ్రాన్ 2; రజిత నాటౌట్ 9; మదుషంక (బి) అర్ష్‌దీప్ 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (16.4 ఓవర్లలో ఆలౌట్) 137.**
వికెట్ల పతనం: 1-44, 2-44, 3-51, 4-84, 5-96, 6-107, 7-123, 8-127, 9-135, 10-137. **బౌలింగ్:** పాండ్యా 4-0-30-2, అర్ష్‌దీప్ 2.4-0-20-3, శివమ్ మావి 1-0-6-0, అక్షర్ 3-0-19-1, ఉమ్రాన్ 3-0-31-2, చహల్ 3-0-30-2.



చేతన్ శర్మకే మళ్లీ చైర్మన్ పదవి

భారత క్రికెట్ సీనియర్ సెలక్షన్ కమిటీని ప్రకటించిన బీసీసీఐ

18 నవంబర్ 2022...పనితీరు బాగా లేదంటూ చేతన్ శర్మ నాయకత్వంలోని సెలక్షన్ కమిటీని రద్దు చేసి కొత్తగా దరఖాస్తులు కోరిన బీసీసీఐ...

7 జనవరి 2023... సెలక్టర్లలో ఒకడిగా ఎంపిక కావడమే కాదు... కమిటీ చైర్మన్‌గా చేతన్ శర్మ పునర్నియామకం...



ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఐదుగురు సభ్యుల కొత్త సీనియర్ సెలక్షన్ కమిటీని ప్రకటించింది. చేతన్ శర్మ (నార్త్‌జోన్) చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో సలీల్ అంకోలా (వెస్ట్), సుబ్రతో బెనర్జీ (ఈస్ట్), శివ్ సుందర్ దాస్ (సెంట్రల్), ఎస్.శరత్ (సౌత్‌జోన్) సభ్యులుగా ఉంటారు. టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు వైఫల్యం అనంతరం బోర్డు రద్దు చేసిన కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించిన చేతన్ శర్మనే మరోసారి చైర్మన్ కావడం విశేషం. అయితే పేరుకు కమిటీ రద్దయినా...ఇదే బృందం న్యూజిలాండ్, బంగ్లాదేశ్ పర్యటనలకు, తాజాగా శ్రీలంకతో జరుగుతున్న సిరీస్‌కు కూడా జట్లను ఎంపిక చేసింది. టీమ్ పేలవ ప్రదర్శనపై జరిగిన సమీక్షా సమావేశంలో కూడా చేతన్ శర్మ పాల్గొన్నాడు.

ఎంపిక జరిగిందిలా...

సెలక్టర్ పదవి కోసం సుమారు 600 దరఖాస్తులు వచ్చినట్లు బీసీసీఐ ప్రకటించింది. అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే, సులక్షణా నాయక్ సభ్యులుగా ఉన్న బోర్డు క్రికెట్ అడ్వైజరీ కమిటీ ఇందులో అన్ని అర్హతలు ఉన్న 11 మందిని షార్ట్ లిస్ట్ చేసి జనవరి 1 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించింది. చైర్మన్‌గా గరిష్టంగా ఏడాదికి రూ. 1 కోటి వేతనం కావడంతో... ఇంతకంటే ఎక్కువగా ఆర్జిస్తున్న పలువురు మాజీ అగ్రశ్రేణి క్రికెటర్లు సెలక్టర్ కావడానికి ఇష్టపడటం లేదు.

అనుభవమిదీ...

చేతన్ భారత్ తరఫున 23 టెస్టులు, 65 వన్డేలు ఆడి 128 వికెట్లు పడగొట్టగా, సలీల్ అంకోలా 1 టెస్టు, 20 వన్డేలు ఆడి 15 వికెట్లు తీశాడు. 23 టెస్టులు, 4 వన్డేలు ఆడి 1375 పరుగులు చేసిన శివ్ సుందర్ దాస్ నేపథ్యం ఒడిషానే అయినా కెరీర్ చివర్లో విదర్భకు ఆడటంతో సెంట్రల్‌జోన్‌నుంచి అతని పేరును పరిగణలోకి తీసుకున్నారు. సుబ్రతో బెనర్జీ 1 టెస్టు, 6 వన్డేలు ఆడి 8 వికెట్లు పడగొట్టాడు. ఎస్.శరత్ ఒక్కడే అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. అయితే దేశవాళీలో 139 మ్యాచ్‌ల ఘనమైన అనుభవంతో పాటు ఇటీవలి వరకు జూనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా పని చేయడం కూడా కలిసొచ్చింది.

టాటా ఓపెన్ విజేత గ్రీక్‌స్పూర్



పుణే: భారత్‌లో నిర్వహించే ఏకైక ఏటీపీ టోర్నీ టాటా ఓపెన్ మహారాష్ట్ర (ఏటీపీ 250) శనివారం ముగిసింది. సింగిల్స్‌లో నెదర్లాండ్స్ ఆటగాడు గ్రీక్‌స్పూర్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో గ్రీక్‌స్పూర్ 4-6, 7-5, 6-3 స్కోరుతో బెంజమిన్ బోన్జి (ఫ్రాన్స్)ను ఓడించాడు. 2 గంటల 16 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో తొలి సెట్‌ను కోల్పోయినా...పట్టుదలతో ఆడిన 26 ఏళ్ల గ్రీక్‌స్పూర్ తన కెరీర్‌లో తొలి ఏటీపీ టైటిల్ సొంతం చేసుకోవడం విశేషం. మరో వైపు డబుల్స్‌లో భారత జోడి శ్రీరామ్ బాలాజీ – జీవన్ నెడుంజెళియన్ రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో సాండర్ గిల్ – జొరాన్ వీగన్ (బెల్జియం) ద్వయం 6-4, 6-4తో శ్రీరామ్–జీవన్‌లపై విజయం సాధించింది.

దక్షిణాఫ్రికా 149/6

సిడ్నీ: ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికా పేలవ బ్యాటింగ్ ప్రదర్శన కొనసాగింది. మూడో టెస్టు నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి సఫారీ టీమ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఖాయా జోండో (39), తెంబా బవుమా (35) మాత్రమే ఫర్వాలేదనిపించారు. ఇప్పటికీ దక్షిణాఫ్రికా మరో 326 పరుగులు వెనుకబడి ఉంది. అయితే ఆసీస్ ఆధిపత్యం కనిపిస్తున్నా...టెస్టు 'డ్రా'గానే ముగియవచ్చు! చివరి రోజు ఆదివారం గరిష్టంగా వేయగలిగే 98 ఓవర్లలో మిగిలిన 14 దక్షిణాఫ్రికా వికెట్లను తీయడం ఆసీస్‌కు అంత సులువు కాదు. అంతకు ముందు వాన కారణంగా లంచ్ వరకు కూడా ఒక్క బంతీ పడలేదు. దాంతో ఓవర్‌నైట్ స్కోరు 475/4 వద్దనే తొలి ఇన్నింగ్స్‌ను ఆసీస్ డిక్లేర్ చేసింది. ఫలితంగా 195 పరుగులతో ఉస్మాన్ ఖాజా నాటౌట్‌గా నిలిచాడు. ఫ్రాంక్‌వారెల్ (197 నాటౌట్), సచిన్ (194 నాటౌట్) తర్వాత కెప్టెన్ ఇన్నింగ్స్ డిక్లేరేషన్‌తో 190ల్లో ఆగిపోయిన మూడో ఆటగాడిగా ఖాజా నిలిచాడు.

సినిమా



● పొన్నియిన్ సెల్వన్



● ఆర్ఆర్ఆర్

ఏషియన్ ఫిల్మ్ అవార్డుల్లో రెండు భారతీయ చిత్రాలు

- పొన్నియిన్ సెల్వన్‌కు ఆరు
- ఆర్ఆర్ఆర్‌కు రెండు

పదహారవ ఏషియన్ ఫిల్మ్ అవార్డ్స్‌కు సంబంధించిన నామినేషన్స్ శనివారం వెల్లడయ్యాయి. ఈ అవార్డుల్లో రెండు భారతీయ చిత్రాలు 'పొన్నియిన్ సెల్వన్ 1', 'ఆర్ఆర్ఆర్'కి నామినేషన్స్ దక్కాయి. మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియిన్ సెల్వన్ 1' ఆరు విభాగాల్లో (బెస్ట్ ఫిల్మ్, బెస్ట్ ఒరిజినల్ మ్యూజిక్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్, బెస్ట్ ఎడిటింగ్, బెస్ట్ సినిమాటోగ్రఫీ, బెస్ట్ కాస్ట్యూమ్ డిజైన్) నామినేషన్స్ దక్కించుకుంది. విక్రమ్, 'జయం' రవి, కార్తీ, ఐశ్వర్యా రాయ్, త్రిష తదితరులు ముఖ్య తారలుగా ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందింది. తొలి భాగం గత ఏడాది సెప్టెంబరు 30న విడుదలై, దాదాపు 500 కోట్ల గ్రాస్‌ను వసూలు చేసి బాక్సాఫీస్ రికార్డును సృష్టించింది. కాగా రెండో భాగం 'పొన్నియిన్ సెల్వన్ 2' ఈ ఏడాది ఏప్రిల్ 28న రిలీజ్ కానుంది. ఇక గత ఏడాది సంచలన విజయం సాధించిన 'ఆర్ఆర్ఆర్' సినిమా రెండు విభాగాల్లో (బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్, బెస్ట్ సౌండ్) నామినేషన్ దక్కించుకుంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా 2022 మార్చి 25న విడుదలై బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ. 1300 కోట్ల గ్రాస్‌ను వసూలు చేసిందీ చిత్రం. ఇక ఈ 16వ ఏషియన్ ఫిల్మ్ అవార్డ్స్‌లో నామినేషన్ దక్కించుకున్నవారు అవార్డులూ అందుకుంటారా? అనేది మార్చి 12న తెలుస్తుంది. ఎందుకంటే ఆ రోజు హాంకాంగ్‌లో ఈ అవార్డుల వేడుక జరగనుంది.

బాఫ్టా లాంగ్ లిస్ట్‌లో ఆర్ఆర్ఆర్

95వ ఆస్కార్ అవార్డుల షార్ట్ లిస్ట్ (నాటు నాటు పాట), గోల్డెన్ గ్లోబ్ నామినేషన్స్.. ఇలా ఇప్పటికే పలు అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటిన 'ఆర్ఆర్ఆర్' చిత్రం మరో ఘనతను సాధించింది. 2023 బాఫ్టా (బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్) లాంగ్ లిస్ట్‌లో చోటు దక్కించుకుంది. నాన్ ఇంగ్లిష్ విభాగంలో 'ఆర్ఆర్ఆర్'కు చోటు దక్కింది. ఇదే విభాగంలో సౌత్ కొరియన్ ఫిల్మ్ 'డెషిసన్ టు లీవ్' ఉంది. ఇక ఈ బాఫ్టా లాంగ్ లిస్ట్ డాక్యుమెంటరీ జాబితాలో ఇండియాకు చెందిన 'ఆల్ దట్ బ్రీత్స్' కూడా ఉంది. ఈ ఏడాది జనవరి 19న బాఫ్టా నామినేషన్స్ రానున్నాయి. ఫిబ్రవరి 19న అవార్డుల ప్రదానం జరుగుతుంది. మరి... లాంగ్ లిస్ట్‌లో ఉన్న చిత్రాలు నామినేషన్ దక్కించుకుని, అవార్డూ దక్కించుకుంటాయా అనేది చూడాలి.

సౌత్ కొరియన్ మూవీకి 10 నామినేషన్లు

16వ ఏషియన్ ఫిల్మ్ అవార్డ్స్‌లో సౌత్ కొరియన్ థ్రిల్లర్ 'డెషిసన్ టు లీవ్' చిత్రం 10 విభాగాల్లో (బెస్ట్ ఫిల్మ్, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ యాక్టర్, బెస్ట్ యాక్ట్రస్, బెస్ట్ సినిమాటోగ్రఫీ, బెస్ట్ ఎడిటింగ్, బెస్ట్ ఒరిజినల్ మ్యూజిక్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్, బెస్ట్ సౌండ్) నామినేషన్స్ దక్కించుకుంది. ఇదే సినిమా 95వ ఆస్కార్ అవార్డుల్లో ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో షార్ట్ లిస్ట్ కావడం మరో విశేషం. అంతే కాదు.. ఈ ఏడాది కేన్స్ చిత్రోత్సవాల్లో బెస్ట్ డైరెక్టర్ అవార్డును ఈ చిత్రదర్శకుడు పార్క్ చాన్ వూక్ అందుకున్నారు.

అయ్యో ఏంటో ...

సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ జంటగా అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వం వహించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. శ్రవణ్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అయ్యో ఏంటో నాకు' అనే లిరికల్ పాటను శనివారం విడుదల చేశారు. ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించగా, స్వీకర్ అగస్తి పాడారు. ''పెళ్లి నేపథ్యంలో సాగే ఆహ్లాదకర కథతో నూతన దర్శకుడు అనిల్ కుమార్ ఈ చిత్రం రూపొందించారు. సంక్రాంతి పండగకి వస్తున్న మా చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.




● సంతోష్

ఆ ఇద్దరిలా నేనూ సపోర్ట్ లేకుండా వచ్చా!

- దర్శకుడు బాబీ

''చిరంజీవిగారి జడ్జిమెంట్ పక్కాగా ఉంటుంది. 153 సినిమాలు చేసిన అనుభవం ఆయనది. అలాంటి చిరంజీవిగారు నేను చేసిన 'వాల్తేరు వీరయ్య' ఫైనల్ కాపీ చూస్తున్నారన్నప్పుడు రెండు రాత్రులు నిద్రపట్టలేదు. సినిమా చూశాక చిరంజీవిగారు నన్ను హత్తుకుని 'బ్లాక్ బస్టర్ కొడుతున్నాం బాబీ' అన్నారు.. ఆ మాటతో గర్వంగా ఫీలయ్యాను" అని డైరెక్టర్ బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా రవితేజ కీలక పాత్రలో నటించిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న రిలీజ్ కానున్న సందర్భంగా బాబీ చెప్పిన విశేషాలు.



● చిరంజీవిగారికి ఒక ఫ్యాన్ బాయ్‌గా 2003లో నా ప్రయాణం మొదలైంది. ఆయన సినిమాలో ఏదో ఒక విభాగంలో పని చేయాలనే కల ఉండేది. అలాంటిది మెగాస్టార్‌ని నేను డైరెక్ట్ చేసిన 'వాల్తేరు వీరయ్య' విడుదలవుతుండటం నా జీవితంలో స్పెషల్ మూమెంట్. ప్రెస్‌మీట్‌లో చిరంజీవిగారు నన్ను కౌగలించుకొని ముద్దు పెట్టుకున్న ఫోటోని ఫ్రేమ్ కట్టించుకుని ఇంట్లో, ఆఫీసులో పెట్టుకున్నా. ● 'వాల్తేరు వీరయ్య' కథని లాక్‌డౌన్‌కి ముందు చిరంజీవిగారికి చెప్పాను. అయితే లాక్‌డౌన్‌లో ప్రేక్షకులు ఓటీటీకి, డిఫరెంట్ కంటెంట్‌కి అలవాటు పడ్డారు. ఈ క్రమంలో అందర్నీ అలరించే కథ చెప్పాలని దృష్టి పెట్టాం.. ఆ ఆలోచనల నుంచి రవితేజగారి పాత్ర పుట్టింది. ఇద్దరి పాత్రలని సమానంగా డిజైన్ చేశాను. బీ, సీ సెంటర్ ఆడియన్స్‌తో పాటు మల్టీప్లెక్స్ ప్రేక్షకులని కూడా అలరించే అన్ని వాణిజ్య అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. ● చిరంజీవిగారు హిట్‌కి పొంగిపోరు.. ఫ్లాప్‌కి నిరుత్సాహపడరు. రవితేజగారూ అంతే. ఏ సినిమాకైనా ఇద్దరూ ప్రాణం పెట్టి చేస్తారు. ఎలాంటి నేపథ్యం లేకుండా స్వయంకృషితో ఎదిగిన చిరంజీవి, రవితేజగార్లలా నేను కూడా ఏ సపోర్ట్ లేకుండా ఇండస్ట్రీకి వచ్చాను. వాళ్లిద్దరితో సినిమా చేయడం నా అదృష్టం. ● సంక్రాంతికి పోటీ ఉంటుంది.. వేరే నిర్మాతలు అయితే ఒత్తిడి ఉండొచ్చేమో? అయితే నవీన్, రవిగార్లు కావడంతో ఒత్తిడి లేదు. 'వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి' చిత్రాలకు నిర్మాతలు ఒక్కరే కాబట్టి రెండు సినిమాలూ బాగుండాలని పాజిటివ్‌గా ఎదురు చూస్తున్నాం. గోపీచంద్ డైరెక్టర్‌గా, నేను రచయితగా ఇద్దరం చాలా కాలం ప్రయాణం చేశాం. మేమిద్దరం ఒకే బ్యానర్‌లో రెండు చిత్రాలతో సంక్రాంతికి రావడం హ్యాపీగా ఉంది. ఒకరికొకరం ఆల్ ది బెస్ట్ చెప్పుకున్నాం. ● చిరంజీవిగారిని అభిమానించే ఫ్యాన్స్ రవితేజగారిని కూడా అభిమానిస్తారు. చిరంజీవిగారి స్ఫూర్తితో ఈ స్థాయికి ఎదిగానని రవితేజగారు ఎన్నో సార్లు చెప్పారు. సైడ్ క్యారెక్టర్స్ చేసుకునే రవితేజగారు స్టార్ హీరోగా ఎదగడం చిరంజీవిగారికి కూడా ఆనందమే. ఇద్దరికీ హిందీలో మంచి మార్కెట్ ఉంది కాబట్టే ఈ చిత్రాన్ని బాలీవుడ్‌లోనూ రిలీజ్ చేస్తున్నాం.

త్రిష కాదు.. కాజల్?

అజిత్ అరవైరెండో సినిమాలో కథానాయిక ఎవరు? కొన్ని రోజులుగా చెన్నై కోడంబాక్కమ్‌లో జరుగుతున్న చర్చ ఇది. ముందుగా నయనతార పేరు వినిపించింది. ఆ తర్వాత త్రిష పేరు తెరపైకి వచ్చింది. ఇప్పుడు కాజల్ అగర్వాల్ పేరు ప్రచారంలోకి వచ్చింది. అజిత్ 62వ చిత్రానికి విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించనున్నారు. ఇందులో అజిత్ సరసన హీరోయిన్, విఘ్నేష్ భార్య నయనతార నటిస్తారనే ప్రచారం జరిగింది. కారణాలు బయటకు రాలేదు కానీ నయనతార నటించడంలేదట. ఆ తర్వాత త్రిషను సంప్రదించాలనుకున్నారని సమాచారం. అయితే త్రిష కూడా కాదట. కాజల్ అగర్వాల్‌ని ఫైనలైజ్ చేసే ఆలోచనలో యూనిట్ ఉందని సమాచారం. తల్లయ్యాక కాజల్ కొంత బ్రేక్ తీసుకుని, ఇప్పుడు మళ్లీ షూటింగ్స్ చేయడానికి రెడీ అయ్యారు. ప్రస్తుతం కమల్‌హాసన్‌తో ఆమె 'ఇండియన్ 2' చేస్తున్నారు. ఇక గతంలో అజిత్ సరసన కాజల్ 'వివేకం' (2017)లో నటించారు. సో.. మరోసారి ఈ జోడీ కుదురుతుందా? కొన్ని రోజుల్లో తెలిసిపోతుంది.





కొత్తవారిని ప్రోత్సహించాలి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

''తెలుగు సినిమా పరిశ్రమకు కొత్త తరం అవసరం చాలా ఉంది. కొత్తవారు చేస్తున్న ఈ 'అష్టదిగ్బంధనం' సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే కొత్తవారు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రోత్సహించినప్పుడే మరిన్ని కొత్త సినిమాలు వస్తాయి'' అని తెలంగాణ సినిమాటోగ్రఫీ మినిస్టర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సూర్య భరత్ చంద్ర, ఇషికా ముఖ్య తారలుగా బాబా పీఆర్ దర్శకత్వంలో మనోజ్ కుమార్ అగర్వాల్ నిర్మిస్తున్న చిత్రం 'అష్టదిగ్బంధనం'. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విడుదల చేశారు. మనోజ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ – ''ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచనున్నాం. ఒక వినూత్న కథాంశంతో బాబా పీఆర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే 80 శాతం షూటింగ్ పూర్తయింది'' అన్నారు. ''హైదరాబాద్ నేపథ్యంలో సాగే హై వోల్టేజ్ యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ ఇది'' అని బాబా పీఆర్ అన్నారు. ''నటనకు అవకాశం ఉన్న పాత్ర చేస్తున్నాను'' అన్నారు సూర్య భరత్ చంద్ర. ''తెలుగులో నాకు ఇది మూడో సినిమా'' అన్నారు ఇషికా.

సంగీత దర్శకుడు చాంద్ బాషా మృతి



నృత్యదర్శకురాలు సుచిత్ర తండ్రి, గేయ రచయిత చంద్రబోస్ మామ, సంగీత దర్శకుడు చాంద్ బాషా (92) మృతి చెందారు. హైదరాబాద్ మణికొండలోని ఆయన స్వగృహంలో శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. చాంద్ బాషా దక్షిణాదిలో పలు సినిమాలకు సంగీత దర్శకునిగా చేశారు. తెలుగులో 'ఖడ్గ తిక్కన, బంగారు సంకెళ్లు, స్నేహమేరా జీవితం, మానవుడే దేవుడు', కన్నడంలో 'అమర భారతి, చేడిన కిడికి' వంటి పలు చిత్రాలకు స్వరాలందించారాయన. చాంద్ బాషాకి ముగ్గురు అమ్మాయిలు, ఒక కొడుకు ఉన్నారు. వారిలో సుచిత్ర కొరియోగ్రాఫర్‌గా, డైరెక్టర్‌గా (2004లో 'పల్లకిలో పెళ్లికూతురు' సినిమా తెరకెక్కించారు) సుపరిచితమే. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో శనివారం ఉదయం చాంద్ బాషా అంత్యక్రియలు జరిగాయి. కాగా ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.